పడకేసిన ప్రత్యేక పాలన

- పంచాయతీలకు నిధుల కొరత
- పల్లెల్లో సమస్యలు తిష్ట


మూలకు చేరిన వాటర్ ట్యాంకర్

లింగాల: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో సమస్యలు తిష్ట వేశాయి. సర్పంచ్‌ల పాలన ముగియడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రత్యేక పాలనలో అధికారులు పల్లెల వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వినిస్తున్నాయి. పల్లెల ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. మండలంలో 23 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ నిధులు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో అంబట్‌పల్లి, అప్పాయిపల్లి, జొసులికుంట, దారారం, చెన్నంపల్లి, సూరాపూర్ గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. చెత్త ట్రాక్టర్‌కు, మొక్కలకు నీటిని అందించే ట్యాంకర్ కూడా డీజిల్ పోయించలేని దుస్థితి నెలకొంది.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

ప్రత్యేక పాలనలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు కాల్వలను శుభ్రం చేయించక పోవడం, గ్రామాలలో పలు వార్డులలో మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వ్యాపిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇళ్ల మధ్య మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారే లేరని వాపోయారు.


లింగాల ప్రధానరోడ్డు పక్కన పారుతున్న మురుగు

నిధుల లేక..

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు కొన్ని నెలలుగా విడుదల కాక పోవడంతో అధికారులు సతమతమవుతున్నారు. పంచాయతీలకు పాలక వర్గాలు ఉంటేనే ప్రభుత్వాలు నిధులు విడుదల చేసే అవకాశాలు ఉంటాయి. కార్మికుల వేతనాల చెల్లింపులు నెలల తరబడి లేకపోవడం, ట్రాక్టర్ల డీజిల్ ఖర్చులు, కనీసం వీధి లైట్లు వేయలేని దుస్థితి దాపురించింది. అక్కడక్కడ కార్యదర్శులు స్వంత ఖర్చులతో పనులు చేసి నెట్టుకొస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గ్రామాలలో ఇళ్ల మధ్య చెట్ల పొదలు ఏపుగా పెరిగాయి. దోమల వ్యాప్తి అధికంగా ఉంది. మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీ అవుతోంది. సర్పంచులు, వార్డు సభ్యులు లేక పోవడంతో సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదు. సరిపడ తాగునీరు సరఫరా చేయడం లేదు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాగయ్య, గ్రామస్తుడు, లింగాల

చర్యలు తీసుకుంటున్నాం

గ్రామాలలో పంచాయతీల పాలక వర్గాలు లేక పోయినా ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమస్యలను పరిష్కరిస్తున్నాం. పారిశుద్ధ్యం పనులు, తాగు నీటి సమస్య రాకుండా చూస్తున్నాం. సీజనల్ వ్యాధులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

–చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, లింగాల

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నాగర్‌కర్నూల్ క్రైం/తాడూరు/తెలకపల్లి/వెల్దండ/కోడేరు: జిల్లా వ్యాప్తంగా ఈనెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాలలో నంబరింగ్ వేశారు. తాగునీటి వసతి కల్పించారు. పరీక్ష కేంద్రాలకు 8.30గంటల వరకు చేరుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్ రావు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు తాడూరు, తెలకపల్లి, వెల్దండ, కోడేరులలో అధికారులు వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు.


తాడూరులో నంబరింగ్ వేస్తున్న సిబ్బంది

జాతీయ యువజన అవార్డుకు శివ ఎంపిక



కల్వకుర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం యువతకు అందించే అత్యుత్తమ యువ పురస్కారానికి కల్వకుర్తి పట్టణానికి చెందిన గుడ్లనరం శివకుమార్ ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం, జన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అందించే నేషనల్ యూత్ అవార్డు శివను వరించింది. ఈనెల ఢిల్లీలో జరిగే జాతీయ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నట్లు శివ మంగళవారం విలేకరులకు చెప్పారు. 13 సంవత్సరాలుగా స్వామి వివేకానంద సేవా బృందం పేరుతో చేస్తున్న సామాజిక సేవలతోపాటు, రైతుల కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు రావడంపై శివను కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు అభినందించారు.

స్వార్థ రాజకీయాలు మానుకోవాలి

మన్ననూర్: ఎస్ఎల్‌బీసీ దుర్ఘటన విషయంలో ప్రతిపక్ష పార్టీలు స్వార్థ రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సంబు వెంకటరమణ, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు హితవు పలికారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద ప్రమాదం జరిగిన మరుసటి రోజు నుంచి ఇప్పటి వరకు సంఘటన ప్రాంతంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్ని విధాలుగా సహాయక చర్యలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి సహకరించాల్సిపోయి ప్రతిపక్షాలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. మానవతదృక్పథంలో ఆలోచించి మాట్లాడాలని సూచించారు.

ఎగ్ రైస్‌లో బొద్దింకలు



కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేటలో ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో తురకలపల్లి గ్రామానికి చెందిన యువకులు మంగళవారం ఎగ్ రైస్ కోసం ఆర్డర్ ఇచ్చారు. ఎగ్‌రైస్‌లో రెండు బొద్దింకలు కన్పించడంతో అవాక్కయ్యారు. నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

బ్యాంక్ పథకాలపై అవగాహన

పెద్దకొత్తపల్లి: మండలంలోని చెన్నపురావుపల్లిలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంక్ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకోల్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రామాంజనేయులు మాట్లాడారు. డబ్బును పొదుపు చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. బ్యాంకులు అందించే పథకాలను వినియోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన బీమా, బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ పూర్ణ చందరావు, రాముడు, మన్సూర్ రూపేష్, శ్రీశైలం, వెంకటస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో గురువారం టాస్క్ సహకారంతో హెటిరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీపాద శార్వాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, డిగ్రీ, ఐటీఐలలో ఆయా విద్యార్హతలు కలిగిన విద్యార్థులతో పాటుగా, ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు జాబ్‌మేళాలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత పత్రాలతో పాటుగా, జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని రావాలని కోరారు.

విద్యార్థులకు ప్రేరణా తరగతులు



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణా తరగతులు మంగళవారం ఏర్పాటు చేశారు. ఆర్‌ఐడీ అల్యుమ్నీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎం.నాగరాజు, రామ్ మనోహర్ సౌభాగ్య మాట్లాడారు. జీవితంలో సక్సెస్ అవ్వడానికి కావాల్సిన అంశాలను, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇమ్మానుయేల్, ఉపాధ్యాయులు కొండారెడ్డి, వెంకటకృష్ణ, కుసుమలత, సరిత, శ్రీకాంత్, నర్సింహరెడ్డి, అన్నపూర్ణ, వరలక్ష్మి, లక్ష్మీదేవమ్మ తదితరులు ఉన్నారు.

అపార్ ఐడీ నమోదు పూర్తిచేయాలి

కొల్లాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ఎంఈఓ ఇమ్మానుయేల్ సమీక్ష నిర్వహించారు. అపార్ ఐడీ నమోదు తక్కువగా ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలతో ఆయన మాట్లాడారు. నిర్దేశిత గడువులోగా అపార్ ఐడీ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా ఇంటర్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించనున్న ఉపాధ్యాయులతో మాట్లాడారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు.

టేక్ హోమ్ రేషన్ విధానం పరిశీలన



కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందించే టేక్ హోమ్ రేషన్ విధానాన్ని ఎంపీడీఓ వెంకటరాములు పరిశీలించారు. మంగళవారం మండలంలోని సుద్దకల్, వేపూరు, బెక్కెర గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. టేక్ హోమ్ రేషన్ విధానంలో భాగంగా ప్రతినెలా ఇచ్చే 16 గుడ్లను, బాలామృతం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తాగునీటి సమస్య రాకుండా చూడాలని, పారిశుధ్యంపై లోపించకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం నర్సరీలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేశ్వరి పాల్గొన్నారు

పెండింగ్ వేతనాలు చెల్లించండి



కోడేరు: పెండింగ్ వేతనాలు చెల్లించాలని మంగళవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల యూనియన్ అధ్యక్షుడు సాయిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు వేతనాలు చెల్లించకపోవడంతో పస్తులుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో మహేష్, లక్ష్మయ్య, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో మంగళవారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లు, ఇతర వాహనాలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పనుల్లో నాణ్యత లోపించొద్దు

తాడూరు: ఉపాధి హామీ పనుల్లో నాణ్యత లోపించొద్దని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని బలాన్‌పల్లి, ఐతోలు గ్రామాలను ఆయన సందర్శించి ఉపాధిహామీ పనులతోపాటు నర్సరీలు, పాఠశాలలను సందర్శించారు. ఉపాధిహామీ సిబ్బందికి, నర్సరీ నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా గ్రామాలలో వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతిమొక్కలను సంరక్షించాలన్నారు. రోడ్డకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని ప్రతిరోజు అందించాలన్నారు. ఏపీఓ చంద్ర సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మొక్కలు ఎండకుండా చర్యలు



కోడేరు: నాటిన మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలకు నీరు పట్టారు. వేసవికాలంలో మొక్కలను నీరు పోయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి రవితేజ, ఫీల్డు అసిస్టెంట్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పనులు అడ్డుకొని నిరసన



తెలకపల్లి: మండలంలోని గడ్డంపల్లి, వనపట్ల గేట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం గడ్డంపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు విస్తీర్ణం పెంచాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. తక్కువ విస్తీర్ణంలో కల్వర్టు నిర్మిస్తే వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతాయని వాపోయారు. పీఆర్‌ఏఈ శివకృష్ణ, మల్లేష్‌ను వివరణ అడగగా నిబంధనల ప్రకారమే కల్వర్టు నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు.

మంటలను అదుపుచేసిన అటవీశాఖ

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో సోమవారం నెలకొన్న కార్చిచ్చు ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది పూర్తి స్థాయిలో అదుపు చేశారు. ఈ సందర్భంగా రేంజ్ ఎఫ్ఆర్‌ఓ గురుప్రసాద్ మాట్లాడారు. దోమలపెంటకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సిబ్బంది మూడు బృందాలు ఏర్పడి మంటలను ఆర్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా 20 మీటర్లు ప్రామాణికంగా తీసుకుని ఎలాంటి అగ్ని ప్రమాదం జరుగకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకునట్లు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఫైర్ బ్రోజర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అటవీశాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల క్షేత్ర ప్రదర్శన

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్విన్నింగ్ స్కూల్ ప్రోగ్రాం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా మంగళవారం జిల్లాలోని వట్టెం నవోదయ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఇన్నోవేటివ్ అంశాలు, ప్రయోగశాల, ఇతర మౌలిక వసతులు, సౌకర్యాలను విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రిని, మయూరీ పార్కును సందర్శించి వివిధ రకాల మొక్కలను తిరిగి చూశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీధర్, అజ్మతుల్లా, శ్యాంసుందర్‌గౌడ్, శ్రీనివాసులు, లక్ష్మణ్, శ్యామలగౌరీ, విజయ, పద్మావతి, శ్రీలత, రాజు, గోపి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీఓ లక్ష్మీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో విద్యార్థినుల గదులను, వంట గదులను ఆమె పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు.

నేడు వాహనాల వేలం

కొల్లాపూర్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను బుధవారం వేలం నిర్వహిస్తునట్లు సీఐ నాగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12 ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 10 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని కోరారు.

బీజేపీ నాయకుల సంబురాలు

పెద్దకొత్తపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీపీయూఎస్ బలపరిచిన బీజేపీ అభ్యర్థి మల్కర కొమరయ్య అఖండ మెజారిటీతో మెదటి ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించడంతో బీజేపీ మండల అధ్యక్షుడు దేశమేని పరశురాముడు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగిన బీజేపీ విజయ దుందుభి మోగిస్తుందని, ఉపాధ్యాయులు చాలా విజ్ఞతతో బీజేపీని ఆశీర్వదించారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పదీర భీమేష్, మేకల శివ, శేఖర్, రాజశేఖర్, సుధకర్‌రావు, మద్దిలేటి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఆడిట్



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్, ఇతర అంశాలపై సోషల్ అడిట్ నిర్వహిస్తున్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో టీమ్ హెడ్ ఆడిటర్ శంకర్ ఆధ్వర్యంలో ఆడిటింగ్ కొనసాగుతోంది. ముఖ్యంగా మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది జీతభత్యాలు, గతంలో ఇక్కడ పనిచేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తప్పుడు లెక్కలపై ఆడిట్ నిర్వహించినట్లుగా అధికారులు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తప్పుడు లెక్కలతో ఎగ్గొట్టిన డబ్బులపై కమిషనర్ మహమూద్ షేక్‌ను అడగగా, అతనితో పూర్తిగా రికవరీ చేశామని, చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేశామని తెలిపారు. ఆడిట్‌లో సీనియర్ ఆడిటర్ నాగార్జున, జూనియర్ ఆడిటర్ మనోహర్, సిబ్బంది ప్రసాద్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలోని పాత కోట పరిసర ప్రాంతంలో తవ్వకాలలో వెలుగు చూసిన మూడు తలల నాగుపాము విగ్రహాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిష్ఠించారు. కాకతీయుల కాలం నాటి చరిత్ర కలిగిన ఆలయం వెనుకభాగం కొంత కాలంగా శిథిలావస్థలో ఉంది. ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి ఆలయం పరిసరాలలో తవ్వకాలు జరపగా మూడు తలలు కలిగిన నాగు పాము విగ్రహం కనిపించింది. ఆ విగ్రహాన్ని వేణుగోపాల స్వామి ఆలయం పరిసర ప్రాంతంలో గ్రామస్తుల సమక్షంలో ప్రతిష్ఠించారు. పులిజాల శేఖర్, సరస్వతి, హాతీరాం, బాలకృష్ణ, వెంకటేష్, పాల్గొన్నారు.

8న లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లిలో ఈ నెల 8న శనివారం లక్ష్మీనరసింహ స్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ చెన్‌రెడ్డి యాదిరెడ్డి తెలిపారు.

కార్యక్రమాల వివరాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 6.03 గంటలకు అంజనేయస్వామికి అభిషేకం, అర్చనలు, దూపదీప నైవేద్యం అనంతరం 8 గంటలకు విఘ్నేశ్వరుని పూజతో ఉత్సవాలను ప్రారంభించి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపడుతునట్లు ఆలయ కమిటీ చైర్మన్ యాదిరెడ్డి తెలిపారు. ఉదయం 9.31 గంటలకు పుణ్యహవాచన, నవగ్రహ పూజ, సుదర్శన హోమం, ఉదయం 11.34 గంటలకు లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం, సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.


కొలువుదీరిన లక్ష్మీనరసింహ స్వామి

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


గగ్గలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కందనూలు/వెల్దండ/తిమ్మాజిపేట/తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లి ఉన్నత పాఠశాల, వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి, తిమ్మాజిపేటలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, తాడూరు మండలంలోని శిర్సవాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన వారిని బహుమతులు అందజేశారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

వెల్దండ: భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుండాలలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్ఐతో కలిసి ఆయన పరిశీలించారు. భక్తులు ప్రమాదాలబారిన పడకుండా కోనేరు చుట్టు కంచె ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్నానం చేసేందుకు కుళాయిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు కోనేరు వైపు వెళ్లవద్దన్నారు. బుధవారం తెల్లవారు జామున 3గంటలకు నిర్వహించే పెద్ద రథోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేవాలయ ఆవరణంలో జక్కుల చిన్న జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్, ఈఓ ప్రసాద్, నాయకులు జంగయ్యయాదవ్, పర్వత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ కురుమూర్తి

అంబా పరమేశ్వరిదేవికి క్షీరాభిషేకం

గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ఉత్సవాల్లో భాగంగా అంబా పరమేశ్వరిదేవికి క్షీరాభిషేకం నిర్వహించారు. వేదమంత్రోచ్చరణ మధ్య అమ్మవారికి అష్టమంగళ ద్రవ్యములతో అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలు కొనసాగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్ కుమార్, ఈఓ ప్రసాద్, నాయకులు పర్వత్‌రెడ్డి, ఆలయ అర్చకులు బాలస్వామి శర్మ, కృష్ణయ్యశర్మ, శివకుమార్‌శర్మ, వీరేశంశర్మ ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

తిమ్మాజిపేట: దుందుభీ వాగు నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పేర ఇష్టానుసారంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. జడ్చర్ల–నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి పక్కనే ఓ వ్యక్తి రెవెన్యూ, పోలీసు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా 20 ట్రిప్పుల ఇసుకను మండలంలోని బుద్దసముద్రంలో మంగళవారం డంపు చేశారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఇంటి నిర్మాణం పేరుతో గ్రామానికి సమీపంలోని దుందుభీ వాగు నుంచి రాత్రి పూట ఇసుక తరలించి విక్రయిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. ఈవిషయమై ఎస్ఐ నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా బుద్దసముద్రంలో ఇసుకను తరలించేందుకు అనుమతి లేదు. ఎవరైన అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.


బుద్దసముద్రం సమీపంలో డంపు చేసిన ఇసుక